## కొలతువాటికథ

రామనాధం నాలుగడుగుల పొడుగుంటాడు. పొట్టిగా ఉంటాడని, రామనాధం బాధ పడని రోజు లేదు. ఆ వీధిలో అతనికున్న నిక్‌నేమ్ 'లిల్లిపుట్' పొడుగు పెరగడానికి ఎన్నో మందులు వాడాడు. పత్రికల్లో అడ్వర్టైజుమెంట్లు చూసి బోల్డెన్ని పుస్తకాలు తెప్పించాడు. ఎక్సర్‌సైజులు చేశాడు. కానీ అతని సైజు మార లేదు. ఓ శుభఘడియన, రామనాధానికి లైటు వెల్గింది. ఊరికి పదిమైళ్ల దూరంలో ఉన్న ఓ అడవిలో తనను అలాపుట్టించిన బ్రహ్మ గురించి తపస్సు చేయాలని నిశ్చయించుకున్నాడు.అతనితపస్సుకు బ్రహ్మలోకంలోని సెక్రటేరియట్ వణికింది. బ్రహ్మ ప్రత్యక్ష్యమయ్యాడు... 'భక్తా ఓ వరం కోరుకో అని సెలవిచ్చాడు.రామనాధం, సంతోషంతో, తన బాధ బ్రహ్మతో మెరపెట్టుకున్నాడు.''స్వామీ నన్ను ఇంత 'షార్ట్'గా ఎందుకు పుట్టించావ్? అందరూ నన్ను 'లిల్లిపుట్' అంటున్నారు. నన్ను మరో'టుఫీట్'

## తెలుగు వాడి తెలుగు

ఎత్తుకు పెంచెయ్యి. అలాగే 'ప్రపోర్షనల్'గా బాడీని కూడా! లేకపోతే, సన్నగా కన్పించను? బ్రహ్మ కాసేపు బుర్ర గోక్కుని, ''నాయనా భక్తా! నీమాటలేమిటో నాకర్దం కాలేదు. నేను అన్ని భాషలు విడివిడిగా అర్దం చేసుకోగలను. మాట్లాడగలను. కానీరెండు భాషల సమ్మేళనం నాకు అర్ద కాదు. కాబట్టి చెబితే పూర్తిగా ఒకే భాషలో చెప్పు'' అన్నాడు. రామనాధం తన తప్పు గ్రహించి, ''సారీ స్వామీ. ఇంగ్లీషులోనే అడుగుతాను'' అని, "Oh god! Made me a man of six feet and also..." ఆ తరువాత ఏ పదం వాడాలో అర్దకాక తికమకపడ్డాడు. రామనాధం టెన్త్‌క్లాస్ వరకే చదివాడు పాపం! బ్రహ్మ అసహనంగా మొహం పెట్టాడు. ఇలా కాదని, తెలుగులోనే ప్రారంభించాడు చివరికి, "స్వామీ.. నేను చాల పొట్టిగా ఉండడం నాకేం బాగాలేదు కాబట్టి నన్ను మరో 'twele inches' పెంచు.." అన్నాడు, తనకలవాటయిన భాషలో బ్రహ్మ చిరునవ్వు నవ్వాడు. 'ఈ తెలుగువాడి గతి ఇంతే' అనుకుంటూ అంతర్ధనమయ్యాడు.

— పి.యస్.వి.రమణ.

సన్యాసిరాజు కళ్ళుతెరిచి ఆవులించాడు. పక్కనే నిద్ర పోతున్న భార్యని ఓసారి చూసి జీవితం అంత పొడుగాటి నిట్టూర్పు విడిచి లేచి కూర్చున్నాడు. రెండు క్షణాలు నిశ్శబ్దంగా తనకి తానే 'కీ' ఇచ్చుకొని మంచం దిగాడు.

'పాలు తేవాలి' అని గుర్తుచేసుకొని డబ్బులు వెతుక్కొని పాలబూత్‌వైపు పరుగుతీశాడు. 'హమ్మయ్య. పాలు దొరికాయి ఇవ్వాళ్టికి' సంతృప్తిగా అనుకున్నాడు సన్యాసిరాజు. అట్నుంచి మార్కెట్‌కి వెళ్ళి చౌకరకం కూరగాయలు చౌకగానే కొనగలిగాడు. సంతృప్తి పడ్డాడు సన్యాసి.

ఇంటికొచ్చి షేవింగ్ సెట్ తీసుకున్నాడు. 'హమ్మయ్య' కొత్త బ్లేడుతో చిన్న వెధవ పాతపెన్సిలు చెక్కలేదు. గడ్డంగీసుకొని పెరట్లోకి వెళ్ళాడు. నీళ్ళు న్నాయి. అంటే పంపు పద్నిమిషాలైనా వచ్చిందన్నమాట. సంతృప్తిగా స్నానం చేశాడు సన్యాసి.

కాఫీ తాగి పాకెట్లో మిగిలిన ఒకేఒక్క సిగరెట్ ముట్టించి, పెళ్ళాన్ని కూరలోకారం ఎక్కువ వెయ్యొద్దని డెమొక్రటిక్‌గా హెచ్చరించి, సైలెన్స్‌గా ఉండని పిల్లలకి 'సైలెన్స్' అని చెప్పి పేపర్ తీశాడు. సన్యాసి. పెద్ద వాడింకా నిద్ర లేవలేదు. పెద్దపిల్ల ఏం చేయాలో తోచక ఇంటిపని చేస్తోంది. పేపరు చూశాడు సన్యాసి.

ధరలు పెరిగాయి. విమాన ప్రమాదం, రెండు రేపులు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం ఎలా? అనే సంపాదకీయం, మూడ్రోజులు నడిచిన చెత్త సినిమా ప్రకటన, సిల్వర్ షూట్స్ అప్, తుఫాను బాధితునికి ముఖ్యమంత్రి ఓదార్పు—పేపరంతా పరమ దరిద్రంగా ఉంది. పక్కన పడేయబోతూ మొదటి పేజీలో కింద ఉన్న 'కరువుభత్యం పెంపుదల' చూసి సంతృప్తి పడ్డాడు సన్యాసి. లేచి నిలబడ్డాడు.

కూరలో కారం ఎక్కువైనందుకు పెళ్ళాన్ని కోప్పడి (తిట్టే హక్కులేదని సన్యాసికి ఎలాగో తెలిసిపోయింది), 'కారం ఎక్కువెయ్యకపోతే అందరికీ చాలదు' అనే ఆవిడ పాతపాట విని భోజనం ముగించి, పాంట్ షర్ట్ వేసుకొని అద్దంలో చూసుకున్నాడు. భుజం మీద డార్నింగ్ కనిపించింది. 'అబ్బే ఎవడూ చూడడు' సంతృప్తిపడ్డాడు సన్యాసి. స్లిప్పర్సు బానే ఉన్నాయి. ఓహోహో...నిన్న వేయించిన సైకిల్ పంక్చర్ లీక్ కాలేదు. తృప్తిపడ్డాడు సన్యాసి.

ఆఫీసుకి లేటు కాలేదు. సంతకంచేసి కుర్చీలో కూలబడ్డాడు సన్యాసి. మేనేజర్ ఘాటుగా తిట్టలేదు. డ్రాఫ్టింగ్ బాగాలేకపోయినా తప్పులు లేవు. సెకన్ల నిముషాలై లంచవర్ వచ్చింది. జేబులో అర్దరూపాయి ఉంది. కాంటీన్లో టీ తాగి సంతృప్తిగా సీట్లోకి వచ్చాడు సన్యాసి.

కుర్చీలో కూర్చుంటూ పక్కటేబుల్‌వైపు చూశాడు. మిస్ చంద్రకళ నవ్వింది. బాగుంది. తనూ కొంతమేర అందగాడేనన్నమాట. సంతృప్తి పడ్డాడు సన్యాసి. అప్పుడెప్పుడో కాలేజీలో చదివే రోజుల్లో తను మాత్రమే ప్రేమించిన రోజీని గుర్తుతెచ్చుకొని ఉబ్బి తబ్బిబ్బై సైగ్లో మునిగాడు సన్యాసి సంతృప్తిగా.


ఆఫీసు అయిపోయింది. బైటపడ్డాడు సన్యాసి. మిత్రుడు కాఫీకి పిలిచాడు. కాఫీ టిఫినూ పూర్తిచేసి సిగరెట్ ముట్టించి సంతృప్తిపడ్డాడు సన్యాసి. అలా వెళ్తుంటే కిరాణాకొట్టువాడు పిలిచాడు. అప్పువిషయం అడిగాడు. తీర్చిపారేస్తానని 'కరువుభత్యం' ఆసరాగా చెప్పాడు. అప్పు అలా తీరిపోతుందని సంతృప్తిపడ్డాడు సన్యాసి. బట్టలకొట్టు వాడికీ, లాండ్రీవాడికి, పేపరువాడికి, ఫాన్సీ షాపువాడికి కూడా అదేమాట చెప్పి, అంతే మోతాదులో తృప్తిపడ్డాడు సన్యాసి. ముందుకి నడిచాడు.

వరసగా ఉన్న సినిమా హోర్డింగులు చూస్తూ ఆగిపోయాడు. ఆ సినిమాల్లో పన్నెండు తప్ప మిగతావన్నీ (రెండంటే రెండే) తనెప్పుడో చూసేశాడు. సంతృప్తి పడ్డాడు సన్యాసి.

అరరె...అక్కడేమిటీ అంత జనం? చాలా ఆశ్యర్యంగా అటువైపు నడిచాడు సన్యాసి. ఎవరో సినీతార కొత్త థియేటర్ ప్రారంభోత్సవానికి వెళ్తోందిట. అభిమానులు కాధాసి స్తన, జఘన పరీక్ష చేస్తున్నారు. దగ్గర

### స్వపరిచయం

జననం 1954. సాహితీ రంగంలోకి అడుగు పెట్టి ఐదేళ్ళయింది. సాధించినది ఒక్క నవల 'పంజరం'. మరో కవితా సంకలనం 'ప్రకంపనం', ఓ పాతిక కథలు, ఓ నాటిక. చలం, శ్రీశ్రీ, రావిశాస్త్రి, కుటుంబరావు రచన లంటే ఇష్టం. మంచి నవల రాయాలనేది సత్సంకల్పం . ప్రస్తుతం ఆంధ్రప్రభ



(విజయనగరం)లో సబ్ ఎడిటర్ ఉద్యోగం. సంక్రాంతి కథల పోటీలో 'విడాకులు'కి, ఇప్పుడు ఈ కథకీ బహుమతులిచ్చి ప్రోత్సహిస్తున్న ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు.

— పులిపాక శ్రీరామచంద్రమూర్తి.

తెలుగు కళాసమితి (మ్యాజెర్పి) వారి 1985 ఉగాది మినీకథల పోటీలో రు. 250 బహుమతి పొందిన రచన.

# ఏన్ ఇండియన్ స్టోరీ




పులిపాక శ్రీరామచంద్రమూర్తి

దగ్గర దగ్గరగా వెళ్ళి సన్యాసి ఆమెని చూశాడు. ఆవిడ అందర్నీ చూస్తూ సన్యాసివైపు 0.01 సెకండ్లసేపు చూసింది. కారు వెళ్ళిపోయింది. అంతలావు గొప్ప నటీ మణిని అంత దగ్గరగా చూడగలిగినందుకు సంతృప్తి...ఛ... బ్రహ్మానందభరితుడయ్యాడు సన్యాసి.

ఇంటికి వెళ్తూ పరిచయం ఉన్న మిత్రులు విష్ చేస్తే తనకి చాలా పలుకుబడి ఉన్నట్టు ఫీలయ్యాడు సన్యాసి. అందులో ఒక మిత్రుడి దగ్గర అప్పుతీసుకొని ఇంటికి చేరాడు సన్యాసి. ఈ డబ్బుతో పెద్దపిల్లకి చీరొస్తుంది. ఇద్దరు పిల్లలకి స్కూల్ ఫీజు కట్టొచ్చు. రేపటికి పాలు, కూరగాయలకు ఇబ్బంది ఉండదు. సంతృప్తిగా స్నానం చేశాడు సన్యాసి. వాలుకుర్చీలో పడుకున్నాడు. అంతలో సబ్బులకంపెనీ సేల్సు గరల్ వచ్చింది. అమ్మాయిని చూసి చాలా బాధపడి, ఒక సబ్బుకొని, ఆ మేరకు సంఘసేవ చేసినందుకు సంతృప్తి పడ్డాడు సన్యాసి. మళ్ళీ వాలుకుర్చీలో కూర్చొని ఊహాగానం ప్రారంభించాడు సన్యాసి. పెద్దదానికి పి.ఎఫ్. లోనుతో పెళ్ళి చేసేస్తాడు. డిగ్రీ చదివి ఇంట్లో కూర్చున్న పెద్ద వెధవకి ఉద్యోగం వస్తుంది. ఎమ్మెల్యేగారికి కుడి భుజంలాంటి వ్యక్తి తన ఫ్రెండు ఫ్రెండుకి, ఫ్రెండు. తను అడిగితే ఎమ్మెల్యే కాదనలేడు. అసలు తన బంధువులంతా గొప్ప హోదాలో ఉన్నారు. వాళ్ళందరి స్టేటస్ తలుచుకుంటూ సంతృప్తి పడ్డాడు సన్యాసి.

చీకటి పడింది. లైటు వేశాడు సన్యాసి. ఓహో... కరెంట్ ఉంది. సంతృప్తి పడ్డాడు సన్యాసి. 'పవర్ ఉత్పత్తి పెరిగిపోయిందని అంకెలతో సహా రాస్తారు. ఈ లైట్లు ఇలా ఏడుస్తాయి' పెద్దవాడు గొణిగాడు. 'అందరికీ కావద్దు మరీ' పోషలిస్టిక్‌గా విసుక్కున్నాడు సన్యాసి.

ఈపూట కూరలో కారం ఎక్కువెయ్యలేదు. తృప్తిగా భోంచేసి మంచం మీద కూర్చున్నాడు సన్యాసి. వారపత్రిక తీసి తిరగేశాడు. ఓ కథ తీసి చదివాడు. అందులో అష్టకష్టాలు పడుతున్న హీరో ఉన్నాడు. అతనికి ముసలి తల్లి ఉంది. తనకి లేదు. సన్యాసి సంతృప్తి పడ్డాడు. మరోకథలో బక్కచిక్కిన రైతు కంటె తను చాలా బెటర్ పొజిషన్లో ఉన్నాడు.

వంటింట్లో పని ముగించి లోపలికి వచ్చింది సన్యాసి భార్య. మంచంమీద కూర్చొని, సన్యాసి వైపు చూసి పడుకుంది. సన్యాసి మంచంలో సర్దుకున్నాడు. 'అందం, బింకం పోయినా బాగానే ఉంది' అనుకున్నాడు సన్యాసి. 'మొన్న మనం చూసిన సినిమాలో బాత్‌టబ్‌లో' చెబుతోంది భార్య. సన్యాసి ఆ సినిమాలోకి వెళ్ళి, ఆ సన్నివేశంలోకి దిగి పోయి, హీటెక్కిపోయి నిదానంగా శాంతించాడు. చాలా సంతృప్తిగా పక్కకి తిరిగి పడుకొని నిద్రపోయాడు.

ఇప్పుడు సన్యాసిరాజు మొహంలో సంతృప్తి లేదు. చిరాకు, అసహనం తప్ప. మళ్ళీ రేపు ఉదయాన్నే లేచి సంతృప్తి బురఖా వేసుకొని, 'కీ' ఇచ్చుకొని వీధిలోకి వెళ్తాడు సన్యాసి.